# ప్రార్థన
# 6

## దేవునియందు నమ్మికయుంచు

యుక్తంగా ఎలాగు ప్రార్థించాలో మనకు తెలియదన్న సంగతిని మనం నేర్చుకున్నాం. కొన్నిసార్లు, మనం ఎంత ఎక్కువగా ప్రార్థిస్తామో అంతగా కలత చెందుతాం. మార్టిన్ లూథర్ ఒక సంగ్రహమైన యోచనను సూచించాడు: "ఆత్మ సంబంధమైన అజీర్తి కాకుండేలా అంత కఠినంగా ప్రార్థించడానికి ప్రయత్నించకు."

ప్రార్థనను గూర్చి నీకు అనేక సంగతులు తెలిసియుండవచ్చు అయినా నీవు ప్రార్థించకపోవచ్చు. ప్రార్థించడం వలన ప్రార్థించ నేర్చుకొంటాం. ప్రార్థనలో ఉండే అతి గొప్ప పులకరింపు నీవు కోరినవి పొందడం కాదు, నీ జీవితంలో దేవుడు కార్యానికి దిగినట్టు కనుగొనడం. ప్రార్థనలో ఉండే అతి గొప్ప దీవెన నీవు కోరిందేదో దాన్ని పొందడం కాదు, దేవుని పొందడం! ప్రార్థనలో ఉన్న శక్తి దేవుని కలిగియుండడం – దేవుని జవాబు పొందడం, దేవుని నడిపింపును పొందడం. హెచ్చరిక! "GP" అనేది ఆకాశంలో కనబడితే, "Go preach" (వెళ్లి ప్రకటించు) అని అర్థం కాదు; "Go plow" (వెళ్లి దున్ను) అని కూడా అర్థం కావచ్చు. మనం గుర్తులను చదువుతాం, అయినా తప్పుగా. అప్పుడు దేవుణ్ణి నిందిస్తాం. ప్రార్థన విఫలమైనట్టుగా భావిస్తాం. నేను ఎంత ఎక్కువ కాలం జీవిస్తే, దేవుని మార్గదర్శకత్వం కనుగొనడం అంత కష్టమౌతుంది! దేవుని నడిపింపుకొరకు ప్రార్థించు. దేవుని నడిపింపును వెదకు. అప్పుడు మెల్లగా ముందుకు సాగు. టి. వీ. ప్రసంగీకులు నన్ను భయపెడుతూ ఉంటారు! వారి సాక్ష్యాలు నన్ను దిగ్భ్రమ కలిగేలా చేస్తాయి. వారు ప్రార్థించారంట, దేవుడు వెంటనే "నలుపు తెలుపుల్లో" (వ్రాత మూలకంగా) జవాబు ఇచ్చాడట. ఇది నా అనుభవం కాదు. కొన్నిసార్లు ఎంత కష్టపడి చూస్తానో, అంత తక్కువగా కన్పిస్తుంటుంది. దేవుని కరుణాహస్తము "గాలిపటం కంటె ఎక్కువ ఎత్తుగా" ఎగురుతుందట. మన స్వార్థపరమైన ఆశయాలను గురుతుల్లా చదవడం చాలా సులభం.

సరియైన పరిస్థితులలో వివరించబడని తలంపులు తెలివైన నిర్ణయాలను చేయవచ్చు. అయినా, అవి లేఖనాలవలే తప్పులులేని మార్గాన్ని చూపేవి కావు. అసంపూర్ణమైనవి పొరపాటుపడదగినవి, సున్నితమైనవి … జాగ్రత్తగా వాటిని చేపట్టాలి. మనం అనుభవించేది ఏదీ కూడా తప్పు చేయను ఆస్కారం లేనిది కాదు. ఫీలింగ్స్‌ను ఆలోచనకును, సహజ వివేచనకును బదులుగా ఉంచకూడదు. ఏదో ఒకదాన్ని గూర్చి మంచి మనోభావం మంచిదే కావచ్చు. అంత మాత్రాన చేయవలసింది అది అని దాని అర్థం కాదు. ప్రార్థనలో ఏదియు తనంతట అదే జరిగేది కాదు.

నీ ప్రార్థనలు స్పష్టపరచు. నీవు ఎదురు చూచే జవాబు తేటగా ఎదురు చూడు. ఏదియెలాగున్నా, వేరైనది ఏదైనా సంభవించితే, దేవుడు వినడంలేదని దాని అర్థం కాదు. నీవు యింకా ఏదైనా నేర్చుకొనవచ్చు. లేఖనాలను పరిశీలించు. దేవునికి చెవియొగ్గు. ప్రార్థన ఎంతగా మాట్లాడడమో, అది అంతగా వినడమైయుంది. దేవుని నడిపింపుకొరకు చూడు. వినయంగా లోబడు. ఉద్వేగంచేత నడిపింపబడేలా లోబడకు. అక్కడలేని సందేశాలను చూడకు.

దేవుని నడిపింపును కనుగొనడానికి మన సింపుల్ జవాబు "గొర్రెబొచ్చు వేయడమే." న్యాయాధి. 6:36–40 మరల చదువు. దేవునిచే గిద్యోను ఒక పనికి పిలువబడ్డాడు. తనకు ఏమి కావాలో దేవుడు గిద్యోనుకు స్పష్టంగా చెప్పాడు. సమస్య దేవుని నడిపింపుది కాదు. సమస్య విధేయతదే! గొర్రెబొచ్చు వేసినప్పుడు గిద్యోను దేవుని నడిపింపును వెదకలేదు – దేవుని రుజువును అతడు కోరుతున్నాడు. "నెమ్మదిగా నేర్చుకునేవారి దేవుని క్లాసులో గిద్యోను ప్రత్యేకమైన విద్యార్థి!" పాఠం గిద్యోను యొక్క గొర్రెబొచ్చు కాదు, కాని అది దేవుని సహనం. గిద్యోనును దేవదూత అప్పటికే పిలిచాడు. దేవుడు అప్పటికే అద్భుతం చేశాడు. **గొర్రెబొచ్చు యొక్క ప్రదర్శన అనుమానమే గాని విశ్వాసం కాదు.**

ఏదియెలాగున్నా, గిద్యోనును కఠినంగా తీర్పు తీర్చకు. నిజంగానే, సమయాలు కష్టమైనవి. దేవుడు ఎక్కడ ఉన్నాడు? గిద్యోను "ఏమి యెరుగని వెర్రివాడు కాదు." అతడు భయపెట్టబడినవాడు. అతడు సత్యవంతుడు.

కీర్తనలు యింకను మన ప్రార్థనా పుస్తకమైయుంది. లేఖనానుసారమైన ప్రార్థన అలవాటు చొప్పున చేసే వ్యర్థత కాదు. ప్రార్థన గాయపరచబడిన మనిషి యొక్క నిష్కళంకమైన భావనయైయుంది. గిద్యోను దేవుని నమ్మకపోవడం కాదు అది అతనినే నమ్ముకోలేక పోవడం. గొర్రెబొచ్చు మన సమస్యను పరిష్కరించదు. విశ్వసించి విధేయత చూపడం పరిష్కరిస్తుంది. ఒకనికి ఈత నేర్పాలంటే నీళ్లతో రిస్కు ఉంటుంది. గిద్యోనుకు దేవుడు అంతగా తెలియదు. "నీ ప్రార్థనలన్నిటికంటె యథార్థమైన సందేహంలో ఎక్కువ విశ్వాసముంది." విశ్వాసము గుడ్డిది కాదు. ప్రార్థన కాకమ్మ కథ కాదు. దేవుడు ఉపయోగించుకొన గోరినప్పుడు ఎవడును "అల్పుడు కాదు" అనే పాఠాన్ని గిద్యోను నేర్చుకోవలసి వచ్చింది. అయితే ఒకడు ఆయన ఉపయోగించుకోలేనంత "పెద్దవాడై" యుండవచ్చు. నీ మనోభావాలను కాదు, దేవునియందు విశ్వసించు. ఎక్కువ మంది "కనుపరచుకొనేలా నటన చేస్తారు" ప్రదర్శించడం కాదు. – దేవుని కృప నిన్ను ఎక్కడ నిలుపలేదో దేవుని చిత్తం నిన్ను అక్కడికి నడిపించదు. సమాధి కార్యక్రమంలా నీ ప్రార్థనను ముందుగా క్రమపరచుకొనడానికి ప్రయత్నించకు. నీకు జవాబులు లేకపోవచ్చు, కాని నీకు దేవుడున్నాడు.

# ఇతరుల పక్షంగా చేయు ప్రార్థన

## (లూకా 22:31-34)

"నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీకొరకు వేడుకొంటిని; నీ మనసు తిరిగిన తరువాత నీ సహోదరులను స్థిరపరచుమని చెప్పెను" (లూకా 22:32).

ఎలా ప్రార్థించాలో నాకు తెలియదు. ఒకవేళ నాకు తెలిసివుంటే, ప్రార్థించే అవసరం నాకు లేకపోవచ్చు. ఎలా ప్రార్థించాలో నాకు తెలియదు గనుక, ఎలా ప్రార్థించాలో నేర్పించడం కూడా నాకు తెలియదు. నాకు కొద్దిగా తెలుసు; నాకు తెలిసింది ఏమంటే – ఇతరుల కొరకు ప్రార్థించే అవకాశం ఉంది. మనం ఒకరికొరకు ఒకరం ప్రార్థించు కోవచ్చు. ఇది ఎంతో గొప్పది!

నేను దేవునితో మాట్లాడగలను.
నీ గురించి నేను దేవునితో మాట్లాడగలను.
నేను నీకు చేయగల మహా గొప్ప కార్యం నీ కొరకు ప్రార్థించడమే.

ఆశ్చర్యం! ఈ పాఠంలో ప్రార్థన ప్రాముఖ్యం, మరియు సమస్య ఉంది. – ఇతరుల కొరకు ప్రార్థించుట యాచన అంటే ఒకడు మరొకనితో యింకొకని పక్షంగా మనవిచేయడం. తెలివిగా ఒక స్త్రీ యిలా అంది: "నేను యితరుల కొరకు ప్రార్థన చేస్తాను ఎందుకంటే నేను చాల బలహీనురాలను, వారు ఎంతో అవసరతలో ఉన్నారు, మరియు దేవుడు ప్రార్థనలకు బదులిస్తాడు." ఆమేన్! నా ప్రార్థన నిన్ను ఎలా మార్చగలదు? ఇది వ్యక్తిగత స్వాతంత్ర్యాన్ని ఉల్లంఘిస్తుందా? ఇతరుల కొరకు ప్రార్థించడమనేది మహా గాఢమైనది, ఆదర్శమైనది, స్వార్థరహిత కార్యమైయుంది. దేవుడును మనుష్యుడును యిందులో శ్రేష్ఠమైన బాంధవ్యంలో ఉన్నారు! మహా గొప్ప ప్రార్థన "నాకిమ్ము" అని మనకొరకు ఒక జాబితాను సమర్పించడం కాదు, కాని యితరుల కొరకు నిష్కపటంగా ప్రార్థించడమైయుంది. నీ ప్రార్థనలను గూర్చి ఆలోచించుకో. అవి నీ కొరకు సంబంధించినవా యితరుల కొరకు చేసేవా? మనం చేసే తీవ్రమైన ప్రార్థనలు యితరులకు సంబంధించినవే. ఇతరులకొరకు ప్రార్థించడమనేది ప్రాచీనకాలపు భావనగా వేర్లు పాతుకొనియున్నాయి. అది మన ఆత్మ యొక్క ఎక్స్‌రే అయుంది. నేను మారడానికి యిష్టపడనప్పుడు యితరులను మార్చుమని నేను దేవునికి ప్రార్థించేది ఎలా? అందువలన ఈ పాఠాలు రాయడం కష్టమైపోయింది. ప్రార్థన అంటే దేవుని కేవలం సహాయం కొరకు విన్నవించుకొనడమే కాదు – అది వ్యక్తిగతమైన మార్పుకు తనను తాను సమర్పించు కొనడమునైయుంది.

దేవా, ప్రార్థించడానికి నాకు సహాయం చేయండి
ఎందుకంటే నేను నాకొరకు ప్రార్థించుకోలేను!

"అహమునకు సంబంధించి నాలో దేనిని ఉంచకు." ఇతరుల కొరకు చేసే ప్రార్థన యితరులను మార్చలేకపోవచ్చును, కాని అది నన్ను మార్చుతుంది. మనం ప్రార్థన విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉంటాం? సన్నిహితంగా ఉండ భయపడే మన సహజ గుణాన్ని అది బయటపెడుతుంది. అది స్నేహ బంధాలు పెంచుకొనక పోవడానికి హేతువైయుంటుంది. ఆత్మ సంబంధమైన జీవితానికి పోషణలేని స్థితిని కనుపరచుతుంది. ఇతరులను గూర్చి చేసే ప్రార్థనకు గొప్ప స్నేహ బంధం అవసరం! యాచనకు సాధువైన మృధువైన గుణం, దయ, ప్రేమ అనేవి అవసరమౌతాయి. భార్యభర్తలకు సంబంధించిన సమస్యలలో "దేవా, నా సహవాసిని మార్చండి" అని ప్రార్థించడం జరుగుతుంది. నిజమైన (యాచన) ప్రార్థన ఎలాగుండాలంటే, "దేవా, నన్ను మార్చు, మొదటిగా నన్ను మార్చు!" అని ప్రార్థించాలి. "నీ చిత్తము నెరవేరును గాక" అనేది సుఖదుఃఖాలను సమంగా భావించేవారి సమర్పణం కాదు. ప్రార్థన పరిస్థితులను అనుకోకుండ మార్చదు. దేవుడు మాత్రమే పరిస్థితులను మార్పు చేస్తాడు. ఆయన విషయాలను మార్చుతాడు; ఆయన మనలను మార్చడానికి ఆనందిస్తాడు. ప్రార్థించడం అంటే మారడమే. నిజమైన ప్రార్థన ప్రేమమైయుంది. "బాగా ప్రేమించేవాడు బాగా ప్రార్థిస్తాడు."

లూకా 22:31-34లో క్రీస్తు ప్రభువు పేతురు కొరకు ప్రార్థించాడు. ఈ ప్రార్థన పేతురును పడిపోకుండ చేయలేదు, అయినా పేతురు తిరిగివచ్చేలా చేసింది! "పేతురు కొరకు ప్రార్థించినట్టు ప్రభువు యూదాకొరకు ప్రార్థించాడా?" అనేది తరువాత ప్రశ్న. ఇతరుల కొరకు చేసే ప్రార్థనలో ఇది మనలను సమస్యలోనికి దింపుతుంది. - పేతురు తప్పిపోకుండ ఉండాలని ఆయన ప్రార్థించాడు, అతడు పడిపోతాడని ప్రభువు ముందుగా బయలుపరచిన తరువాత కూడా ప్రార్థించాడు! మన అతి గొప్ప ప్రార్థనలు యితరుల కొరకు చేసేవే!

## ఇతరుల కొరకు చేసే ప్రార్థన లేఖనానుసారమైనది

బైబిల్లో మొదటిగా, మర్యాదస్థుడైన యోబు ఇతరులపట్ల ప్రార్థించాలని ఎరిగి ఆచరించాడు. అతడు అనుదినము తన పిల్లల కొరకు యాచించాడు (యోబు 1:5). యోబు యొక్క ప్రార్థనల ద్వారానే అతని ముగ్గురు స్నేహితులను దేవుడు క్షమించాడు (యోబు 42:7-9).

మోషే యొక్క గాఢమైన ప్రార్థనలను మనం మరచిపోకూడదు. అనేకమైన గొప్ప లక్షణాలకు అతడు పేరుగాంచాడు - అయితే అతని ప్రార్థనాజీవితం అసమానమైనది. నీ ప్రార్థనలను వృద్ధి చేసికొనడానికి మోషేను చదువు! నిర్గమ. 32లోని ప్రార్థన జ్ఞాపక చిహ్నం వంటిది. అది దేవుని బయలుపరచుతోంది! అది మోషేను కూడా బయలుపరుస్తుంది! అది ప్రార్థనను బయలుపరచుతోంది! అహరోనుచే నిర్మింపబడిన "బంగారు దూడను" పూజించడంతో ఇశ్రాయేలీయులు సీనాయి కొండవద్ద దేవునికి విరోధంగా తిరుగుబాటు చేశారు! నరులు పాపం చేసినప్పుడు దేవుని ఉగ్రత బయలుపరచబడుతూ ఉంటుంది.

అబ్రాహామునుండి కాకుండ తన ద్వారా క్రొత్త దేశాన్ని స్థాపించగోరి ఇశ్రాయేలీయులను లయపరచుతానని దేవుడు మోషేకు తన సమాచారాన్ని అందించాడు. ఇది ఆలోచనను రేకెత్తించునదైయుంది. అధికారము, బిరుదులు, బహుమానాలు అక్కరలేదని చెప్పిన వారున్నారు. రాజకీయాలలో, "పొటోమాక్ ఫీవర్‌కు" వైద్యంలేదు. మోషే సాహసించాడు ... మోషే రిస్కు తీసికొన్నాడు ... "ఒక్కొక్కటిగా" మోషే దేవుని యొద్దకు తీసికొని వెళ్లాడు (1) క్రొత్త అంతస్థును అంగీకరింపనతడు నిరాకరించాడు. (2) (ఆశ్చర్యకరమైన విధానం) బైబిలు దేవుని అతడు కోట్ చేసి – అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులకు ఆయన చేసిన వాగ్దానాన్ని అతడు దేవునికి గుర్తు చేశాడు. (3) మోషే దేవుని ఎంత బాగా ఎరుగునో! తన ఉగ్రత విషయంలో ఆలోచన చేయవలసిందిగా అతడు దేవుని వేడుకున్నాడు! నరుడు దేవుని గద్దించినట్టుందా? నమ్మలేం! (4) దేవుడు మార్చాడు (మోషే కాదు)! నమ్మశక్యం కాదు! అతడు అంగీకరింపబడ్డాడు. ఎందుకంటె, మోషే సత్యం కలిగినవాడును తన ప్రజలను ప్రేమించినవాడునైయున్నాడు. అతని అక్కరంతా దేవుని గౌరవం కొరకును, ఇశ్రాయేలీయుల రక్షణ కొరకునైయున్నది. పైగా, ఇశ్రాయేలీయులు శిక్ష విధింపబడినవారై, తరువాత రక్షింపబడ్డారు. అయినా దేవునికిని మోషేకును మధ్య జరిగిన ఈ సంభాషణ వారికి తెలియలేదు. దేవుని ఉగ్రతలోని పరిమాణాన్ని వారు ఎరుగలేదు. సరిగదా, వారు మోషే ప్రార్థనను సయితం విన్నవారు కారు!

ఇతరుల ప్రార్థనవలన మన జీవితాలు ఎంతవరకు తాకబడ్డాయి? నా కొరకు ప్రార్థించు! మోషే తన దేశాన్ని రక్షించుకొనడం మాత్రమేగాక, ప్రార్థనల ద్వారా అక్కయైన మిర్యామును, తన అన్నయైన అహరోనును కూడా అతడు పునరుద్ధరించుకోగలిగాడు (సంఖ్యా. 12:13). సంఖ్యా. 14:13–19లో మోషే ఇశ్రాయేలీయులను మరోసారి రక్షించాడు. వారు తిరుగుబాటు చేసినప్పుడు, మోషే ప్రార్థించాడు – దేవుడు వారిని క్షమించాడు. మోషే పరిచర్యలో ఇరవైయయిదు ప్రార్థనా సంఘటనలను మనం చదువుతాం.

ఎజ్రా, నెహెమ్యాలు తమ తండ్రుల యొక్కయు దేశము యొక్కయు పాపములను ఒప్పుకొని వారి కొరకు ప్రార్థించారు. ప్రభువైన యేసు పేతురు కొరకు ప్రార్థించాడు. ఆయన మనకొరకు విజ్ఞాపనము చేయడానికి నిరంతరం నిలిచియున్నాడు (హెబ్రీ. 7:25). ప్రభువు మనకొరకు యింకను ప్రార్థిస్తునే ఉంటాడు. పాపం చేసిన గారడీవాడైయుండిన సీమోనుకొరకు ప్రార్థించమని పేతురుని కోరారు. (అపొ. 8:12–24). ఒక వినోదమైన సంఘటన అపొ. 12లో కన్పిస్తుంది. యాకోబు హతసాక్షియయ్యాడు, పేతురు చెరసాలలో ఉన్నాడు. ప్రార్థించడానికి సహోదరులు కూడుకున్నారు. దేవుడు యాకోబు హత్యను జరుగనిచ్చాడు, అయితే ఆయన పేతురు మరణం జరుగకుండా చేశాడు. పేతురు ఒక దేవదూత ద్వారా విడిపింపబడ్డాడు. ప్రార్థనలు ఎక్కడ సమర్పించబడుతున్నాయో ఆ యింటికే పేతురు వెళ్లాడు. ఒక చిన్నది మాత్రమే అతడు పేతురు అని నమ్మగలిగింది! తీర్మానింపబడని కొన్ని సమస్యలు ప్రార్థనలో చిక్కుకున్నట్టు యిది రుజువు చేస్తుంది.

ఒకరి పాపాలను ఒకరితో ఒప్పుకొంటూ ఒకరికొరకు ఒకరు ప్రార్థన చేయవలసిందిగా యాకోబు తెలిపాడు (యాకోబు 5:13–16). సంఘంగా మనం చేయగల ఒక (ప్రాక్టికల్) పని యిది. మన శత్రువులను ప్రేమించి వారికొరకు మనం

ప్రార్థన చేయవలసియుంది (మత్తయి 5:43-48). మనం సువార్తికుల కొరకు ప్రార్థించాలి (1 థెస్స. 5:25). ప్రార్థనలేని సీట్లు శక్తిలేని ప్రసంగ వేదికలను చేస్తాయి. ప్రార్థించే నాయకులు ప్రార్థించే అనుచరులను బలపరచుతారు.

లోకం కొరకు ప్రార్థించు. పునరుద్ధరణ కొరకు ప్రార్థించు. రోగుల కొరకు ప్రార్థించు. మనం అనేక సార్లు: "దేవా వీరెవరో నీకు తెలుసు" అంటూ బహు సాధారణంగా ప్రార్థించుతాం. నీవు నా కొరకు ప్రార్థించినప్పుడు నీవు నా పేరును ప్రస్తావించావా? ఇతరులకు మనం చేసేది ఏదియు వారికొరకు ప్రార్థించుటకంటె ఎక్కువైనది కాదు. ఎంతవరకు వారికొరకు మనం ప్రార్థించుతామో సహోదరులను మనం అంతవరకు ప్రేమించువారమైయుంటాం.

ప్రార్థించడం మానుకునే సమయం ఉంటుంది! భయం చెందడం! మోషేయు సమూయేలును ఇశ్రాయేలీయుల కొరకు ప్రార్థించారు. ఏదియెలాగున్నా, మోషేయు సమూయేలును ఇశ్రాయేలు కొరకు ప్రార్థించినా, ఆ జనులు పాపం చేసినందున ఆయన ఆలకించునని దేవుడు యిర్మీయాకు తెలిపాడు (యిర్మీయా 15:1). పాపముతో కఠినమైన మనస్సులను అటు కృపగాని యిటు ప్రార్థన గాని తాకలేని సమయం వస్తుంది. ఇశ్రాయేలీయుల కొరకు ప్రార్థన చేయవద్దని దేవుడు యిర్మీయాకు మాటి మాటికి తెలిపాడు. యిర్మీయా ప్రార్థించగోరాడు, కాని దేవుడు వద్దన్నాడు! లేఖనాల్లో కష్టమైన ఒకదానిలో కొందరి కొరకు ప్రార్థన చేయమన్నాడు కొందరికొరకు చేయవద్దాన్నాడు (1 యోహాను 5:16). ఈ లేఖన భాగాన్ని లోతుగా చదువు. పాపము కఠినం చేసే సమయం ఆసన్నమయ్యేవరకు, ప్రాచీన కాలపు సమూయేలు చేసినట్లు జరిగించు, ప్రార్థించు! ప్రార్థన లోకాన్ని మార్చడం తక్కువగాను, మనలను మార్చుకొనడానికి ఎక్కువగాను తోడ్పడుతుంది.

## క్రీస్తు యొక్క మాదిరి

ప్రార్థించడం నీవు ఎలా నేర్చుకున్నావు? ఎక్కడ? ఎలా ప్రార్థించాలో నేర్చుకొనడానికి క్రైస్తవులు బైబిలులో చూస్తారు. మనం ప్రభువైన యేసు వద్దనుండి నేర్చుకుంటాం, ఆయన "ప్రార్థనాపరుడు" ఆయన ప్రార్థనలో రాత్రి గడిపాడు (లూకా 6:12). ప్రార్థన యేసును గూర్చి నేర్చుకొనుటయైయుంది. ఆయన యితరుల కొరకు ప్రార్థించాడు, ప్రత్యేకించి పన్నిద్దరి కొరకు ప్రార్థించాడు. యోహాను 17లో – ఆయన తన పన్నిద్దరి కొరకు మాత్రమే గాకుండ, మన కొరకు కూడా ప్రార్థించాడు! మనమందరం ఏకమైయుండాలని ఆయన ప్రార్థించాడు. సంఘమంతా ఏకమయ్యేవరకు లోకం ఎన్నడు ఆకర్షింపబడదు! (నీవు ప్రార్థించలేనంతవరకు ప్రార్థించు).

లూకా 22లోని మన లేఖన భాగం వద్దకు తిరిగి వద్దాం. తాను పడిపోతాడని ఎరిగిన ప్రభువు పేతురు కొరకు ప్రార్థించాడు! ఇతరుల కొరకు చేసే ప్రార్థనలోనున్న చిక్కు స్థితి బయటపడుతుంది! దేవుని సర్వాధికారం మానవ స్వేఛ్ఛా చిత్తాన్ని ఉల్లంఘించదు! నా కోర్కె యితరుల మనస్సాక్షిని త్రోసివేయదు. ప్రార్థనను గారడీకి మార్చవద్దు: "నా భార్యను లోపంలేని దానిగా నేడు చేయండి"; "నేడు లక్షలకొలది

మిషినెరీలను రష్యాకు పంపండి!" అని అడుగవద్దు. ఇది విశ్వాసం కాదు; ఇది ప్రార్థన కాదు. ఇది గారడి, ఆరాధన కాదు. ఇది శక్తిని తప్పుగా వినియోగించ చూడడం, ప్రభువైన యేసు యొక్క ఆధిపత్యానికి లోబడడం కాదు. ఇది మూఢ నమ్మకం, దేవునితో లోతైన వ్యక్తిగతపు బాంధవ్యం కాదు.

అందువలననే "ఎలా చేయాలి" అని నేర్పే పుస్తకం పనికిరాకుండా పోతుంది. క్రైస్తవ్యం విశ్వాసమైయుంది. "దేనినైనా చేయ నేర్చుకొన్న కొలతల థియోలజీ" కాదు. అది వృత్తి రహస్యం గాని, సూత్రంగాని కాదు. ప్రార్థన దేవునికి ఆయన చిత్తానికి లోబరచుకొనడమైయుంది. ప్రార్థన పోరాటమైయుంది, "అది ఆత్మయొక్క వ్యాయామ శాలయైయుంది." అనుదిన మరణాన్ని వెంటాడమని దేవుడు కోరుతున్నాడు, తన కోర్కెలను నెరవేర్చుకొనడం కాదు (1 కొరింథీ. 15:31). రెండవది మరణానికి నడిపిస్తుంది, మొదటిది జీవానికి నడిపిస్తుంది.

ప్రశ్న సమయం! నేను నా రహస్య ప్రార్థనలో, నా పొరుగువాని జీవితాన్ని మార్చగలనా? నాకు ఏమైనా అతని నిమిత్తం నేను ప్రార్థించాలా? అతడు నన్ను అడుగకపోయినా ప్రార్థించాలా? అవును! మనుష్యులందరి కొరకు ప్రార్థించాలి (1 తిమోతి 2:1, 2). వారు పాపం చేసినప్పుడు కూడా ప్రార్థించాలి. ప్రార్థించడం మానితే మనం పాపం చేసినవారమై ఉంటామని సమూయేలు అన్నాడు (1 సమూ. 12:23). మనకు సంపూర్ణమైన స్వాతంత్ర్యంలేదు. సముద్ర తీరముననున్న చిన్న రాళ్లకంటె నరులు ఎక్కువ సన్నిహితంగా కలిసియుంటారు. చిన్నరాళ్లు ఊరకే తాకుతాయి. పొలంలోని వేర్లకంటె మనుష్యులు ఎక్కువగా పెనవేసికొనియుంటారు. పలుకబడిన ప్రతి మాట, వ్రాయబడిన పుస్తకం, చేయబడిన పని – నా రహస్యం మీద దాడిచేసేదే. ఒకరి ప్రార్థనల మీద ఒకరం ఎందుకు ఆధారపడియుండకూడదు?

శత్రువుల కొరకు ప్రార్థించు (మత్తయి 5:44). శత్రువును ద్వేషించేదానికి బదులు, అతని కొరకు ప్రార్థించు. ఇతరుల కొరకు చేసే ప్రార్థనలో సువార్త పరిచర్య కూడా జతచేయబడింది. యాకోబు 5:16 యిలా అంటుంది: "మీ పాపములను ఒకనితో ఒకడు ఒప్పుకొనుడి, మీరు స్వస్థత పొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థన చేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదైయుండును." ప్రార్థనయు దేవుని కరుణాహస్తమును జతకూడి ఉంటాయి (కొలస్సీ. 4:3). ప్రార్థన ద్వారా దేవుడు అవకాశ ద్వారాన్ని తెరుస్తూ ఉంటాడు. ప్రార్థన సత్కార్యాలను బలపరచుతుంది (2 కొరింథీ. 1:11). క్రీస్తు హృదయము విజ్ఞాపనతో కూడినది. క్రైస్తవ్యం యొక్క హృదయం కూడా విజ్ఞాపనముతో కూడినదే.

## పౌలు యొక్క ప్రార్థనా జాబితా

లోకం "నిర్ణయపట్టికలను" వేయడంలో ఉత్సాహం చూపుతుంది. అధిక ధనవంతులు, రూపవంతులు, కీర్తివంతులు. ఒక టీ. వీ. స్టార్‌కు తన "టాప్ టెన్ జాబితా" ఉంది. ఆలాటి జాబితాలు రమ్యంగా ఉంటాయి, కాని నిజానికి పనికిమాలినవే. పౌలుకు ఒక జాబితా ఉంది. అతనిది ప్రార్థనా జాబితా. ఆ జాబితాలో నీవు ఉండడానికి యిష్టపడవా?

అతడు యితరుల కొరకు ప్రార్థించాడు; తన కొరకు ప్రార్థించుడని అతడు యితరులను కోరాడు (కొలస్సీ. 4:3). నశించినవారికొరకు పౌలు ప్రార్థించాడు (రోమా 9; 10). పౌలు సాధారణంగా కాకుండా, ప్రత్యేకించి ప్రార్థించాడు. అతడు సహోదరులను, సంఘాలను పేరు పేరుతో పిలిచాడు.

సహోదరత్వం కొరకు అతడు ప్రార్థించాడు. నిజమైన ప్రార్థనకు మళ్లిన సంఘము, సంఘాన్ని మార్చుతుంది. పౌలు సంఘాన్ని లక్ష్యపెట్టాడు (2 కొరింథీ. 11:28). అతడు ప్రార్థించాడు; అతడు విమర్శించలేదు, వృథా మాటలు పలుకలేదు. మనం పెద్దలు, సువార్తికులు, పరిచారకులు, ఉపదేశకుల కొరకు ప్రార్థించాలి. ఉపదేశకులారా, మీరు మీ విద్యార్థుల కొరకు ప్రార్థిస్తున్నారా? ప్రభువైన యేసు సహోదరుడైన యాకోబు "ముసలి ఒంటె- మోకాళ్ల"వాడు అని పిలువబడేవాడు. ఎందుకంటె అతడు సహోదరుల నిమిత్తము ఎక్కువగా ప్రార్థించేవాడు.

పౌలు ప్రభుత్వం కొరకు ప్రార్థించాడు (1 తిమోతి 2:1-3). తదుపరి తన తలను కొట్టివేసిన కైసరు కొరకు పౌలు ప్రార్థించాడు. తాను చనిపోయిన ఆ దినాన అతడు కైసరుకొరకు ప్రార్థించాడని నీవు తలంచావా? ఇతరుని కోసం ప్రార్థించడం కంటె అతని పట్ల మంచి వ్యవహారం ఇంకొకటి లేదు.

ప్రభువా, అనుదినము జీవింప నాకు సహాయపడుము
అహమును మరచిపోయే విధంగా,
నేను ప్రార్థించ మోకరించినప్పుడు సహితము,
నా ప్రార్థనలు యితరుల కొరకై ఉండేలా.

"ప్రభువా, నేను ప్రార్థనయందు నమ్మికయుంచను.
నేను నీయందు విశ్వాసముంచుచున్నాను.
విశ్వాసంతో ప్రార్థన చేయ నాకు నేర్పించండి."

## ప్రార్థనను గూర్చి ఆలోచించుట

"ఎవడు గొప్పవాడో అతడు ప్రార్థనయందు పట్టుదలగాను, సూత్రములయందు భయములేని వాడుగాను, తన ఉద్దేశాలలో స్థిరుడును, తన వాగ్దానాలలో నమ్మదగినవాడునై యుండాలి."

"యుగములన్నిటను తన పిల్లలకు ప్రార్థన నేర్పిన తల్లికి మించిన శ్రేష్ఠమైన స్నేహితు(రాలి)ని ఏ దేశము ఎన్నడు కలిగియుండలేదు."

"ఏదో యొక దానినుండి దేవుని తప్పించ ప్రయత్నించే దానికంటె ప్రార్థన అనేది దేవునితో ఏదో మాట్లాడడమైయుంది."

"ప్రార్థనకంటే దేవుడు మనకు ఎక్కువ దూరంలో లేదు."